సాక్షి ప్రకాశం

శనివారం | 9 | డిసెంబర్ | 2023



అట్రాసిటీ కేసుల్లో నిందితులకు శిక్ష పడాలి

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో నిందితులకు శిక్ష పడేలా చూడాలని ఎస్పీ ఆదేశించారు.

- 8లో..



ప్రాణం తీసిన అతివేగం

వేగంగా వస్తున్న బైక్ ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను ఢీకొని ఓ యువకుడు మృతిచెందగా ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన పుల్లల చెరువు మండలంలో జరిగింది.

- 8లో..

గరిష్టం/కనిష్టం
30/23

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రేపు వైఎస్సార్ టీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం

ఒంగోలు: వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యవర్గ సమావేశం ఈనెల 10న నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ టీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మట్టిగుంట మహేశ్వరరావు, పర్వతం రమణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశం ఉదయం 10 గంటలకు స్థానిక మాంటిస్సోరి ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తారన్నారు. ఉపాధ్యాయుల సమస్యలతోపాటు 2024 నూతన సంవత్సరం క్యాలెండర్, స్టిక్కర్ క్యాలెండర్ ఏర్పాటుపై ఈ సమావేశంలో చర్చిస్తారన్నారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కేశవరపు జాలిరెడ్డి హాజరవుతారని, జిల్లాలోని రాష్ట్ర, జిల్లా, మండలాల బాధ్యులు తప్పకుండా హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

ఈవీఎంలను పరిశీలించిన డీఆర్వో శ్రీలత



ఈవీఎంలను పరిశీలిస్తున్న డీఆర్‌ఓ శ్రీలత

ఒంగోలు అర్బన్: ఇటీవల ఫస్ట్ లెవల్ చెకింగ్ అయిపోయిన ఈవీఎంలను శుక్రవారం డీఆర్వో శ్రీలత పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మామిడిపాలెం ఈవీఎం గోదాములో కొన్ని ఈవీఎంలను బయటకు తీసి పరిశీలించారు. గోదాము వద్ద సీసీ కెమెరాల పనితీరు, తాళాలకు సంబంధించిన సీళ్లను తనిఖీ చేశారు. డీఆర్వోతో పాటు ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు రాజశేఖర్, సత్యం, రసూల్, కాలేషా బేగ్, రఘురామ్, ఎన్నికల విభాగం సిబ్బంది ఉపేంద్ర, రంగారావు, నవీన్ పాల్గొన్నారు.

అట్టహాసంగా హైదరీక్లబ్ పాలకవర్గం ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన పాలకవర్గం

ఒంగోలు: హైదరీక్లబ్ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం శుక్రవారం ఉదయం స్థానిక హైదరీక్లబ్‌లో జరిగింది. జెడ్పీ సీఈవో బి.జాలి రెడ్డి నూతన కార్యవర్గం చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఉపాధ్యక్షునిగా ఎస్.చంద్రమోహన్‌రెడ్డి, కార్యదర్శిగా డాక్టర్ గుండవరపు రాఘవ, సంయుక్త కార్యదర్శిగా ఈదుపల్లి గురునాథరావు, కోశాధికారిగా జీవి ఆంజనేయులు, ఈసీ సభ్యులుగా మొహమ్మద్ సుల్తాన్ బేగ్, మద్దాలి శ్రీధర్, కొణిజేటి వెంకట సుబ్బయ్య ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో భాగంగా గత పాలకవర్గం, క్లబ్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నూతన కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలిపారు.

ఫొటోగ్రఫీలో ఉచిత శిక్షణ

ఒంగోలు టౌన్: గ్రామీణాభివృద్ధి స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీలో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు రూడ్‌సెట్ డైరెక్టర్ పి.ప్రతాప్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలు భాగ్యనగర్‌లోని సంస్థ కార్యాలయంలో ఈనెల 11 నుంచి 30 రోజులపాటు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. శిక్షణ కాలంలో భోజనం, వసతి సౌకర్యం ఉచితంగా కల్పించనున్నట్లు తెలిపారు. జిల్లాకు చెందిన 19 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 9573363141కు ఫోన్ ద్వారా సంప్రదించాలన్నారు.

బీమాతో ధీమా

ఏదైనా ప్రమాదం జరిగి అంగవైకల్యమైనా, మృతిచెందినా ఆ కుటుంబం ఆర్థికంగా చితికిపోతుంది. అటువంటి సమయంలో ఏదైనా బీమా పాలసీ ఉంటే ఆ కుటుంబానికి కొండంత అండగా ఉంటుంది. తక్కువ ప్రీమియంతో రూ.10 లక్షల విలువైన బీమా పథకాన్ని పోస్టల్ శాఖ ప్రవేశపెట్టింది. రూ.396 ప్రీమియంతో ఉన్న ఈ పాలసీ ఈనెల 11 నుంచి రూ.520గా పెరగనుంది. ఈలోపు దరఖాస్తు చేసుకుంటే తక్కువ ప్రీమియంతోనే మెరుగైన బీమాను పొందవచ్చు.

- తపాలా శాఖ వినూత్న పథకం
- రూ.396 తో రూ.10 లక్షల బీమా
- 18 నుంచి 65 ఏళ్ల మధ్య వయస్సు వారు అర్హులు
- మరింత ప్రియం కానున్న ప్రీమియం
- ఈనెల 11 నుంచి రూ.520గా పెరగనున్న ప్రీమియం
- జిల్లాలో ఇప్పటి వరకు 14,250 మంది పాలసీలో నమోదు



ఒంగోలు ప్రధాన తపాలా కార్యాలయం

ఒంగోలు సెంట్రల్: తపాలా శాఖ వినూత్న రీతిలో టాటా ఏఐజీ ఇన్సూరెన్స్ సంస్థ సౌజన్యంతో పేద, బడుగు, బలహీన వర్గాలకు అందుబాటులో ఉండేలా గ్రూప్ యాక్సిడెంట్ గార్డ్ పాలసీని రూ.396కే అందుబాటులోకి తెచ్చింది. ఈ పాలసీ ద్వారా ఎలాంటి ప్రమాదం సంభవించినా బీమా తీసుకున్నప్పటి నుంచి ఏడాది పాటు రూ.10 లక్షల బీమా కవరేజి వర్తిస్తుంది. యాక్సిడెంట్ బీమా పాలసీ 18 నుంచి 65 ఏళ్ల వయసున్న వారికి మాత్రమే వర్తిస్తుంది. ఈ పాలసీని 2022 ఏప్రిల్‌లో తపాలా శాఖ ప్రవేశపెట్టింది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఒంగోలు, మార్కాపురం పోస్టల్ డివిజన్‌ల పరిధిలో 914 పోస్టాఫీసులు ఉన్నాయి. వాటి పరిధిలో ఇప్పటి వరకు 14,250 మంది పాలసీ తీసుకున్నారు. అయితే మంచి డిమాండ్ ఉన్న నేపథ్యంలో ఈ ప్రీమియం కూడా ఈనెల 11 నుంచి రూ.520గా పెరగనుంది.

బీమా పాలసీ పొందాలంటే..

ఈ పాలసీ పొందాలంటే ముందుగా పోస్టల్ బ్యాంక్ ఖాతా కలిగి ఉండాలి. ఖాతా లేని వారు రూ.200తో నూతనంగా ఖాతా తెరవాలి. బీమా పాలసీకి రూ.396 నగదు చెల్లించి పొందవచ్చు. ప్రమాదం సంభవిస్తే మాత్రమే ఈ బీమా వర్తిస్తుంది. బీమా చేసుకున్న తర్వాత ప్రమాదం సంభవించినా, పక్షవాతం వంటివి వచ్చినట్లయితే ఈ బీమా వర్తిస్తుంది. పాలసీ కోసం నగదు చెల్లించిన రోజు అర్ధరాత్రి 12 గంటల నుంచి బీమా రక్షణ లభిస్తుందని తపాలా శాఖ అధికారులు పేర్కొన్నారు. పాలసీదారులకు ఒక బాండ్‌ను కూడా ఇస్తారన్నారు.

పాలసీ వర్తించే విధానం ఇలా....

- యాక్సిడెంట్ డెత్ (ప్రమాదవశాత్తు మృతి చెందినట్లయితే) రూ.10 లక్షల బీమా వర్తిస్తుంది.
- శాశ్వత వైకల్యం కలిగిన వారికి రూ.10 లక్షలు ఇస్తారు.
- పక్షవాతం సంభవిస్తే రూ.10 లక్షలు
- వైద్య ఖర్చులకు (ఐపీడీ) రూ.60 వేల వరకు లేదా వాస్తవ క్లయిమ్ ఏది తక్కువ అయితే అది నిర్ణయిస్తారు.
- విద్య ప్రయోజనం (గరిష్టంగా అర్హత ఉన్న ఇద్దరు పిల్లలకు) 10 శాతం. రూ.లక్ష అసలు ఖర్చులు ఏది తక్కువ ఉంటే అది వర్తిస్తుంది.
- ఆస్పత్రిలో ఉంటే పది రోజుల వరకు రోజుకు వెయ్యి అందుతుంది. (ఒక రోజు మినహాయిస్తారు)
- కుటుంబ రవాణా ప్రయోజనాలు రూ.25 వేలు, అసలు ఏది తక్కువ అయితే అది. అంత్యక్రియల ప్రయోజనం రూ.5 వేలు, అసలు ఏది తక్కువ అయితే అది వర్తిస్తుంది.
- గ్రామీణ ప్రాంతాల్లో పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలందరూ బీమా పొందేలా ఈ పాలసీని రూపొందించారు. మరిన్ని వివరాల కోసం సమీప తపాలా శాఖ కార్యాలయాన్ని సంప్రదించవచ్చు.

తక్కువ ప్రీమియం, మరింత లాభం



తక్కువ ప్రీమియంలో మరింత మేలు చేకూరేలా ఉండటంతో పాలసీ తీసుకున్నాను. తక్కువ మందికి మాత్రమే ఈ పోస్టల్ ఇన్సూరెన్స్ గురించి తెలుసు. ప్రతి రోజు అనేక వందలు ఖర్చు చేస్తుంటాం. కానీ మన కోసం రోజుకు ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేకపోతే ఎలా. ఇన్సూరెన్స్ తీసుకుంటే కుటుంబ సభ్యులకు భారం లేకుండా ఉంటుంది.

– హనుమంతరావు, డ్రైవర్, కేవీపాలెం.

18 నుంచి 65 ఏళ్ల వారికి మాత్రమే



18 నుంచి 65 సంవత్సరాల వారికి మాత్రమే రూ.396 తో రూ.10 లక్షల వరకు ప్రమాద బీమాను అందుబాటులోకి తెచ్చింది. యాక్సిడెంట్ అయితే ఇన్‌పేషెంట్‌కు గరిష్టంగా రూ.60 వేలు, ఔట్ పేషెంట్ అయితే రూ.30 వేలు అందిస్తారు. మరణిస్తే వారి పిల్లలకు చదువులకు ఒకరికి అయితే రూ.50 వేలు, ఇద్దరికి రూ.లక్ష వరకు అందిస్తారు. మంచి పాలసీని ప్రజలు ఉపయోగించుకోవాలి. ఈనెల 11 నుంచి ఈ ప్రీమియం రూ.520గా పెరగనుంది. అందులో అదనంగా రెండు లాభాలు కూడా పెంచారు. కోమా, ఇన్‌పేషెంట్స్‌కి రూ.1 లక్షల వరకు ప్రీమియం నగదు ఇవ్వనున్నారు.

– సీహెచ్.వంశీకృష్ణ, సీనియర్ మేనేజర్, ఇండియన్ పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు, ఒంగోలు



సీఎం జగన్‌ను కలిసిన బూచేపల్లి వెంకాయమ్మ



సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న వెంకాయమ్మ

ఒంగోలు సిటీ: బాపట్ల జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రకాశం జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు జెడ్పీ నూతన భవనానికి సంబంధించిన నిధులు మంజూరు చేయాలని ఆమె సీఎంని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

నకిలీ ఓట్లను నివారించాలి

- డీఆర్‌ఓకు ఫిర్యాదు చేసిన వైఎస్‌ఆర్ సీపీ నాయకుడు క్రాంతికుమార్



డీఆర్వోకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్‌ఆర్ సీపీ నాయకుడు దామరాజు క్రాంతికుమార్

ఒంగోలు అర్బన్: జిల్లాలో నకిలీ ఓట్లను నివారించాలని తెలుగుదేశం పార్టీ నాయకులు నకిలీ ఓట్లను ఏర్పాటు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి దామరాజు క్రాంతికుమార్ శుక్రవారం డీఆర్వో శ్రీలతకు ఫిర్యాదు చేశారు. రాష్ట్ర పార్టీ కార్యాలయం నుంచి పంపిన నకిలీ ఓట్ల జాబితాతో పాటు ఫిర్యాదు పత్రం, సంబంధిత సీడీని డీఆర్వోకు అందజేశారు. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో కొన్ని వేల నకిలీ ఓట్లు ఉన్నాయన్నారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా రెండు, మూడు ప్రాంతాల్లో ఓట్లు ఏర్పాటు చేసుకున్నారని ఫిర్యాదు చేశారు. తెలంగాణలో ఓట్లు ఉన్న వారికి కూడా ఆంధ్రప్రదేశ్‌లో ఓట్లు కలిగి ఉన్నారని వాటికి సంబంధించి జిల్లాలో కూడా వేలాది ఓట్లు ఉన్నాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఆన్‌లైన్‌లో ఫారం-6, ఫారం-8 ద్వారా మన రాష్ట్రం, జిల్లాలో నకిలీ ఓట్లు చేర్చుకుంటున్నారని పరిశీలించి చర్యలు తీసుకోవడంతో పాటు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పంట నష్టం అంచనాలు వేగవంతం

- రైతులను ఆదుకోవటమే లక్ష్యంగా ముందుకు
- ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ రెండూ వచ్చేలా చర్యలు
- మిచాంగ్ తుఫాన్‌కు దెబ్బతిన్న పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే బాలినేని, కలెక్టర్



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి పక్కన కలెక్టర్, మేయర్



పంట నష్టపోయిన రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ దినేష్ కుమార్, పక్కన మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు సబర్బన్: మిచాంగ్ తుఫాన్ వలన నష్టపోయిన పంటల అంచనాలను వేగవంతంగా చేయిస్తున్నామని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి చెప్పారు. ఈ మేరకు కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారులు, పొగాకు బోర్డు అధికారులతో కలిసి బాలినేని ఒంగోలు మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఒంగోలు నగర శివారు గ్రామం వెంగముక్కలపాలెంలో మిచాంగ్ తుఫాన్‌కు దెబ్బతిన్న మిర్చి, పొగాకు పంటలను పరిశీలించారు. ఆ గ్రామాల రైతులతో పంటల నష్టం గురించి స్వయంగా మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం బాలినేని మీడియాతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా తుఫాన్‌కు వ్యవసాయ, ఉద్యాన, పొగాకు పంటలు దెబ్బతిన్నాయన్నారు. అందుకోసం జిల్లా అధికారులు ప్రాథమికంగా అంచనాలు రూపొందించారని తెలిపారు. పంటల నష్టం పూర్తి స్థాయి అంచనాలను వేగవంతంగా చేయాలని అధికారులకు సూచించామన్నారు. రైతులను ఆదుకోవటమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని వెల్లడించారు. ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు పంటల బీమా కూడా త్వరితగతిన ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని తెలిపారు. గత ప్రభుత్వాలు ప్రకృతి విపత్తులు సంభవించి పంటలు దెబ్బతిన్నప్పుడు నష్టపరిహారాన్ని ఏడాది, రెండేళ్లకు కూడా ఇచ్చేవారు కాదని.. దీంతో రైతులు అప్పుల పాలయ్యేవారన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నష్టపోయిన పంటలకు పరిహారం ఆయన ఇవ్వకుండా వెళ్లిపోతే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత సీఎం వైఎస్ జగన్ ఆయా రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీలు ఇచ్చి ఆదుకున్నారని గుర్తు చేశారు. గత ప్రభుత్వాల మాదిరిగా కాకుండా సీఎం వైఎస్ జగన్ ఏ సీజన్‌లో నష్టపోయిన పంటలకు ఆ సీజన్‌లో నష్ట పరిహారం ఇచ్చి ఆదుకుంటున్నారని గుర్తు చేశారు. ఎక్కువగా పొగాకు పంట దెబ్బతిందని అందులో భాగంగా గత సంవత్సరం వచ్చిన మాండూస్ తుఫాన్‌లో పొగాకు బోర్డు అధికారులతో మాట్లాడి హెక్టారుకు రూ.10 వేల చొప్పున పొగాకు రైతులకు ఇప్పించామన్నారు. అదేవిధంగా ఈ మిచాంగ్ తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులను కూడా ఆదుకోవాలని పొగాకు బోర్డు అధికారులతో మాట్లాడుతున్నామని బాలినేని రైతులకు భరోసా ఇచ్చారు. ఒంగోలు నగరంలో తుఫాన్ వలన ఏ ఒక్కరూ ఇబ్బంది పడకూడదని నగర పాలక సంస్థ అధికారులను ఆదేశించామన్నారు. దాంతో నగర మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు నీరు ఎక్కడా నిలబడకుండా చేశారని అభినందించారు. అదేవిధంగా లోతట్టు ప్రాంతాల వారికి, శివారు కాలనీల ప్రజలకు సకాలంలో భోజనాలు కూడా అందజేశామన్నారు.

కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్ మాట్లాడుతూ వర్షంతో కూడిన ఈదురు గాలులతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. మిర్చి 2,300 హెక్టార్లలో దెబ్బతిందని చెప్పారు. మిర్చిలో మొదటి కోత సమయంలో ఈ నష్టం సంభవించిందని, హెక్టారుకు 20 నుంచి 30 క్వింటాళ్ల మేర దిగుబడి తగ్గిపోయి రైతుల నష్టపోతున్నారని తెలిపారు. వరి 4 వేల హెక్టార్లలో దెబ్బతింటే 2 వేల హెక్టార్లలో పడిపోయిందన్నారు. కోత దశలో ఉన్న మినుము 2,200 హెక్టార్లలో దెబ్బతిందని, కాయల్లో మొలకలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. మినుములో నాణ్యత పడిపోయి, దిగుబడి కూడా భారీ స్థాయిలో తగ్గిపోతుందన్నారు. శనగ పంట మొలక దశ, విత్తనాలు వేసిన దశలో ఉందన్నారు. దాంతో నష్టపోయిన రైతులకు 80 శాతం సబ్సిడీతో కాగ్-2, జే జే రకం విత్తనాలు ఇచ్చేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. గత సంవత్సరం మాండూస్ తుఫాన్‌లో దెబ్బతిన్న పొగాకు పంట పండించిన రైతులకు ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని ద్వారా ప్రభుత్వంతో, పొగాకు బోర్డుతో మాట్లాడి రూ.4.20 కోట్లు సబ్సిడీ ఇప్పించామన్నారు. ఇప్పుడు కూడా ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు పంటల బీమా కూడా త్వరితగతిన ఇచ్చేలా చర్యలు చేపడుతున్నామని వివరించారు. ఓదెల మీద తడిసిన ధాన్యాన్ని సివిల్ సప్లయిస్ విభాగం ద్వారా కొనుగోలు చేసేలా ప్రభుత్వంతో మాట్లాడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి, ఎస్.శ్రీనివాసరావు, పొగాకు బోర్డు ఆర్‌ఎం లక్ష్మణ రావు, ఒంగోలు ఆర్డీఓ ఈశ్వరరావు, ఒంగోలు తహశీల్దార్ ఎం.మురళి, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, ఉద్యానవన శాఖ అధికారి గోపీచంద్, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, నగర అధ్యక్షుడు కఠారి శంకర్, వెంగముక్కలపాలెం నాయకులు మారెడ్డి అంజిరెడ్డి, తిరుమల రెడ్డి, మోదేపల్లి అంజిరెడ్డి, పెద్దిరెడ్డి వెంకటరెడ్డి, బీమనాథం బ్రహ్మానంద రెడ్డి, ఇలవల వెంకటేశ్వర్లు, ఏడుకొండలు, రమేష్, ఉదయ్‌తో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుండ్లకమ్మ నది పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



రెండో గేటు నుంచి వృథాగా పోతున్న నీరు

ఒంగోలు అర్బన్: గుండ్లకమ్మ ప్రాజెక్టు దిగువ భాగంలో ఉంటున్న నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలతో ప్రాజెక్టులో 2 టీఎంసీల పైగా నీరు వచ్చిందని పేర్కొన్నారు. ప్రాజెక్టు రెండో నంబర్ గేటు కింద భాగంలో ఉన్న రెండు ఎలిమెంట్స్ కొట్టుకుపోయాయని, వాటికి యుద్ధ ప్రాతిపదికన ఇంజినీరింగ్ అధికారులు స్టాప్ లాక్స్ ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. నీటి లభ్యతపై రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని ప్రాజెక్టులో 1.5 టీఎంసీల నీరు ఉంటుందన్నారు. గేట్ల మరమ్మతుల కోసం రూ.9 కోట్లతో టెండర్లు పిలిచినట్లు పేర్కొన్నారు.

నిర్ణీత సమయంలో అర్జీల పరిష్కారం



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ దినేష్ కుమార్



అర్జీలు సమర్పించేందుకు వచ్చిన ప్రజలు

- స్పందన సమావేశానికి 206 అర్జీలు
- అధికారుల సహకారంతో అర్జీల పరిష్కారం
- స్పందన కార్యక్రమంలో బాలినేని
- ఒక్క సమస్య లేకుండా పరిష్కరించాలన్న కలెక్టర్

కొత్తపట్నం: అధికారుల సహకారంతో నిర్ణీత సమయంలో అర్జీలన్నీ పరిష్కరిస్తామని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండలంలో ఉన్న వివిధ సమస్యలపై శుక్రవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాలినేని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా అల్లూరు ఎస్సీ కాలనీ వాసులు తమ శ్మశానం ఆక్రమణకు గురైందని, కొలతలు కొలిచి హద్దురాళ్లు ఏర్పాటు చేయాలని కోరారు. పలుగ్రామాల్లో భూముల రీసర్వేలో సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించాలని అర్జీదారులు కోరారు. జీరో ఖాతాలో ఉన్న 5 వేల ఎకరాల భూములకు సంబంధించిన సమస్యలను కూడా పరిష్కరించాలని పలువురు అర్జీలు ఇచ్చారు. ఆలూరు గ్రామస్తులు ఎస్ఎస్పీ కాలువ ఆక్రమణకు గురైందని కొలతలు కొలిచి హద్దు రాళ్లు ఏర్పాటు చేయాలని కోరారు. కొన్ని గ్రామాల్లో రీ సర్వే పూర్తయిందని మిగతా గ్రామాల్లో సర్వే చేయాలని కోరారు.

ఈ సందర్భంగా బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా పరిపాలన వికేంద్రీకరించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సమస్యలు కూడా స్థానికంగానే పరిష్కారం కావాలన్న లక్ష్యంతో మండల స్థాయిలో ప్రత్యేక స్పందన కార్యక్రమాల నిర్వహణకు ఆదేశాలు ఇచ్చారన్నారు. అందులో భాగంగా జిల్లా స్థాయిలో ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. వచ్చిన ప్రతి అర్జీ క్షుణ్ణంగా పరిశీలించి, విచారించి పరిష్కరించడానికి అధికారులు సిద్ధంగా ఉండాలని కోరారు. సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావల్సిందిగా ఆయన కోరారు.

కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో 206 అర్జీలు వచ్చాయని, ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అర్జీలను సకాలంలో పరిష్కరించాలని తెలిపారు. వారు ఇచ్చిన అర్జీలను కార్యాలయం చుట్టూ తిప్పుకోకుండా వెంటనే పరిష్కరించాలని కోరారు. వచ్చిన సమస్యలు చాలా చిన్నవి అని, దృష్టి పెడితే వెంటనే పరిష్కారం అవుతాయన్నారు. వచ్చిన అర్జీదారులతో వివరంగా మాట్లా డారు. కార్యక్రమంలో జేసీ శ్రీనివాసరావు, ఆర్డీవో విశ్వేశ్వరరావు, ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి, తహసీల్దార్ బీవీ రమణారావు, ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత, జిల్లా స్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పశు ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ



పశు ఆరోగ్య కార్డులు అందజేస్తున్న డాక్టర్ బేబీరాణి

నాగులుప్పలపాడు: వాతావరణ మార్పుల వలన పశువుల్లో వచ్చే వ్యాధులపై పాడి రైతులు జాగ్రత్తలు వహించాలని పశుసంవర్ధకశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బేబీరాణి తెలిపారు. శుక్రవారం ఒమ్మెవరం గ్రామంలో తుఫాన్ అనంతరం గ్రామాల్లో పశువులకు రాబోయే వ్యాధులపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువుల్లో వచ్చే గొంతు వాపు వ్యాధికి సంబంధించి 110 పశువులకు టీకాలు అందించారు. అనంతరం 28 పశువుల్లో సాధారణ వ్యాధులకు పరీక్షలు చేసినట్లు జేడీ తెలిపారు. రైతులకు పశు ఆరోగ్య కార్డులు అందజేశారు. డాక్టర్ రమేష్‌బాబు, ఏడీఏ డాక్టర్ నాగభూషణరావు, డాక్టర్ జాస్మిన్, లావణ్య, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రొటెక్షన్ వాచర్‌కు మెరుగైన వైద్యం అందించండి

● మంత్రి ఆదిమూలపు సురేష్ ఆదేశం

యర్రగొండపాలెం: ఎలుగుబంటి దాడిలో గాయపడిన చెవుల వెంకటేశంకు మెరుగైన వైద్యం అందించాలని రాష్ట్ర మున్సిపల్ శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ సంబంధిత అధికారులను శుక్రవారం ఆదేశించారు. మండలంలోని ఇష్టకామేశ్వరి ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న అటవీశాఖ ప్రొటెక్షన్ వాచర్ వెంకటేశంపై గురువారం ఎలుగుబంటి దాడి చేసి తీవ్రంగా గాయపరచింది. పెద్దదోర్నాల ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం హైదరాబాద్ అపోలో ఆస్పత్రికి తరలించి శస్త్ర చికిత్స చేశారు. సంఘటన గురించి తెలుసుకున్న మంత్రి సురేష్.. బీట్ అధికారి మదన్‌తో ఫోన్లో మాట్లాడారు. వెంకటేశంకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. అతని కుటుంబానికి ప్రభుత్వ పరంగా అన్ని విధాలా సహాయం అందే విధంగా చర్యలు తీసుకుంటామంటూ ధైర్యం చెప్పారు.

ఎస్టీల సంక్షేమానికి ఏమేం చేశారు?

● పార్లమెంట్‌లో ఎంపీ మాగుంట ప్రశ్న

ఒంగోలు: దేశంలో షెడ్యూల్డ్ తెగల అభ్యున్నతికి గత ఐదేళ్లలో నేషనల్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ఎందరికి ఎంత మొత్తంలో రాయితీతో కూడిన రుణాలు మంజూరు చేశారని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పార్లమెంట్‌లో ప్రశ్నించారు. దీనికి కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ సహాయ మంత్రి రేణుకాసింగ్ సరుత సమాధానం ఇచ్చారు. దేశంలో ఎస్టీల సంక్షేమానికి గత ఐదేళ్లలో రుణ పథకం, ఆదివాసీ మహిళా స్వశక్తికరణ్ యోజన, మైక్రో క్రెడిట్ పథకం, ఆదివాసీ శిక్షా రిన్ యోజన అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి యూనిట్‌కు, గ్రూపునకు, వ్యక్తులకు ఆచరణీయ ప్రాజెక్టులు, చిన్న అవసరాలు, చదువుకు రూ.50 వేలు మొదలు రూ.50 లక్షల వరకు 90 శాతం రుణం కింద ఆర్థిక సహాయం మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. మిగిలిన పదిశాతం రాయితీ మంజూరు లేదా ప్రమోటర్ సొంతంగా భరించడం ఉంటుందన్నారు. 2019-20 లో 1,20,831 మందికి రూ.285.37కోట్లు, 2020-21లో 1,69,539 మందికి రూ.367.30 కోట్లు, 2021-22లో 1,65,101 మందికి రూ.272.92 కోట్లు, 2022-23లో 72,992 మందికి రూ.299.29 కోట్లు, 2023-24లో 2023 అక్టోబర్ నెలాఖరునాటికి 27,662 మందికి రూ.117.58 కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు.

నేడు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు: ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి శనివారం ఒంగోలు రానున్నట్లు ఆయన కార్యాలయ ప్రతినిధి భవనం సుబ్బారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు తన కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎంపీ అందుబాటులో ఉంటారన్నారు. 12 గంటలకు, సాయంత్రం 4 గంటలకు స్థానికంగా పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని చెప్పారు.

సమస్యలన్నీ పరిష్కరిస్తాం

● ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి



అధికారులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

కొత్తపట్నం: అధికారుల సహకారంతో సమస్యలన్నీ పరిష్కరిస్తామని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. కొత్తపట్నంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలోని గ్రామాల వారీగా సమస్యలను బాలినేని దృష్టికి నాయకులు తీసుకొచ్చారు. గుండమాల గ్రామస్తులు ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా గ్రావెల్ రోడ్లు, విద్యుత్ స్తంభాలు, తీగలు ఏర్పాటు చేయించాలని కోరారు. మోటుమాల గ్రామస్తులు రూ.70 లక్షలతో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఓవర్‌హెడ్ ట్యాంక్ నుంచి గుండమాల వరకు ఆర్ అండ్‌బీ రోడ్డు నిర్మించాలని అడిగారు. సంకువారిగుంట ప్రజలు సైడు కాలువలు, కల్వర్టు, ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి సంకువారిగుంట మధ్యలో బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కోరారు. గాదెపాలెం వాసులు జగనన్న కాలనీలో తాగునీరు, సీసీ రోడ్డు సౌకర్యాలు కల్పించాలన్నారు. వజ్జిరెడ్డిపాలెం సర్పంచ్ కొత్త పంచాయతీ కార్యాలయం బిల్డింగ్, జగనన్న లే అవుట్లలో ఇళ్ల పట్టాలు, విద్యుత్ స్తంభాలు అవసరమని తెలిపారు. కె.పల్లెపాలెం గ్రామస్తులు జగనన్న కాలనీ ఏర్పాటు చేసి పట్టాలివ్వాలని, వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయాలని, కొత్తపట్నం నుంచి కె.పల్లెపాలెం వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు వేయాలని ఎమ్మెల్యే బాలినేనికి విజ్ఞప్తి చేశారు. అన్ని పంచాయతీల ప్రజలు ఆయా గ్రామాల అభివృద్ధి పనులపై అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ అడిగినవన్నీ తప్పనిసరిగా చేస్తానని తెలిపారు. అధికారులు సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని చెప్పారు. ఇప్పటికే కోట్ల రూపాయల నిధులతో పూర్తిచేసిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. మిగిలిన పనులన్నీ త్వరలో పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి, ఆర్డీవో విశ్వేశ్వరరావు, తహసీల్దార్ బీవీ రమణారావు, మాజీ ఎంపీపీ వాయల మోహన్‌రావు, ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత, డీఈవో సుబ్బారావు, జిల్లా స్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుల్లో నిందితులకు శిక్ష పడాలి

● పోలీస్ అధికారులతో సమీక్షలో ఎస్పీ మలికాగర్గ్

● సమస్యలుంటే స్వయంగా వచ్చి చెప్పాలని సూచన



పోలీస్ సిబ్బంది సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ మలికాగర్గ్, పక్కన ఏఎస్పీ నాగేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: ఎస్సీ, ఎస్టీ కేసుల్లో నిందితులకు తగిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పోలీస్ అధికారులకు ఎస్పీ మలికా గర్గ్ ఆదేశించారు. ఈ మేరకు ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, ఒంగోలు డీఎస్పీ వి.నారాయణ స్వామిరెడ్డితో కలిసి తన చాంబర్‌లో డీఎస్పీలతో ఎస్పీ శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఒంగోలు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో ఎస్సీ, ఎస్టీ కేసుల దర్యాప్తులో మెళకువలను వివరించారు. నిందితులకు శిక్ష పడటంతోపాటు బాధితులకు పూర్తి స్థాయిలో న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. కేసుల్లో పోలీస్ సిబ్బంది మొదలు అధికారుల వరకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, డీఎస్పీ స్థాయి అధికారి పరిశోధన చేసే మహిళా సంబంధిత కేసులు, క్రైమ్ ఎగెనెస్ట్ ఉమెన్, రేప్, పోక్సో, గ్రేవ్ ప్రాపర్టీ కేసులతో పాటు ఇతర కేసుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను విశదీకరించారు. ఆయా కేసుల దర్యాప్తు, పురోగతి, నిందితుల అరెస్ట్, చార్జ్‌షీటు దాఖలు చేసే సమయాల్లో తీసుకోవాల్సిన మెళకువలు, మార్గదర్శకాల గురించి వివరించారు. వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్న అట్రాసిటీ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న కేసుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీలపై దాడులు జరిగిన వెంటనే సంబంధిత సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసి సమగ్ర దర్యాప్తు చేపట్టాలన్నారు. పూర్తి స్థాయి సాక్ష్యాధారాలతో నిందితులను అరెస్ట్ చేసి సంబంధిత ఎఫ్ఎస్ఎల్ రిపోర్టులు, ఇతర డాక్యుమెంట్లు త్వరితగతిన తెప్పించి నిర్ణీత సమయంలో చార్జ్‌షీట్‌ను కోర్టుకు సమర్పించాలని ఆదేశించారు. చట్ట ప్రకారం బాధితులకు రావాల్సిన పరిహారం వీలైనంత త్వరగా అందేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. ఇతర కేసుల్లో కూడా ప్రొసీజర్ ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు.

పోలీస్ సమస్యల పరిష్కారం దిశగా..

పోలీస్ సమస్యల పరిష్కారం దిశగా నిర్ణయాలు తీసుకుంటున్నామని ఎస్పీ మలికగర్గ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె తన చాంబర్‌లో శుక్రవారం పోలీస్ సంక్షేమ దివస్‌లో భాగంగా పోలీస్ గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన పోలీసుల సమస్యలను ఎస్పీ శ్రద్ధగా ఆలకించారు. ప్రతి శుక్రవారం పోలీస్ గ్రీవెన్స్ సెల్ నిర్వహిస్తున్నామని, పోలీసులు, హోంగార్డులు వృత్తిపరమైన లేదా వ్యక్తిగత సమస్యలను స్వయంగా వచ్చి చెప్పుకోవచ్చన్నారు. సస్పెన్షన్, ట్రాన్స్‌ఫర్, మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, ఒంగోలు డీఎస్పీ వి.నారాయణస్వామిరెడ్డి, డీపీఓ ఏఓ ఎం.సులోచన, ఐసీసీఆర్ ఇన్‌స్పెక్టర్ దుర్గా ప్రసాద్, ఆర్ఐలు శ్రీహరిరెడ్డి, హరిబాబు, డీసీఆర్‌బీ ఎస్సై నాగేశ్వరరావుతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మో.. ఆఫ్రికన్ నత్తలు!

● మార్కాపురంలోని మాగుంట పార్కులో ప్రత్యక్షం



మాగుంట పార్కులో ఉన్న నత్తలు

మార్కాపురం: ఆఫ్రికన్ నత్తలు(జెయింట్ ఆఫ్రికన్ ల్యాండ్ స్నెయిల్) మార్కాపురం-తర్లుపాడు రోడ్డులోని మాగుంట పార్కులో ప్రత్యక్షమయ్యాయి. గత మూడు రోజులుగా సుమారు 100 నత్తలు పార్కులో సంచరిస్తూ వాకర్లను ఆకర్షిస్తున్నాయి. మన ప్రాంతంలో కనిపించే సాధారణ నత్తల కంటే ఇవి భిన్నంగా ఉండటమే అందుకు కారణం. మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు ఈ నత్తలు వచ్చి ఉంటాయని స్థానికులు భావిస్తున్నారు.

ఇవి మామూలు నత్తలు కావు..

అచాటినిడే కుటుంబానికి చెందిన ఈ ఆఫ్రికన్ నత్తలు ప్రపంచ వ్యాప్తంగా చీడ సమస్యలకు ప్రధాన కారణం. వ్యవసాయ పంటలతోపాటు స్థానిక మొక్కలకూ నష్టం కలిగిస్తాయి. అత్యంత హానికరమైన ఇన్వాసివ్(ఆక్రమిత) జాతుల్లో ఒకటైన ఈ ఆఫ్రికన్ నత్తలు మానవుల్లో మెనింజైటిస్‌కు కారణమవుతున్నాయి. ప్రపంచంలో టాప్ 100 ఆక్రమిత జాతుల్లో ఈ నత్తలూ ఉన్నాయని ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ స్పష్టం చేసింది.

బాలికను నిర్బంధించిన ఉపాధ్యాయుడు

● అదేమని ప్రశ్నించిన కుటుంబ సభ్యులపై కత్తితో దాడి

● ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు



ఉపాధ్యాయుడు శ్రీనివాస ప్రసాద్



ఉపాధ్యాయుడి దాడిలో గాయపడిన బాజి

పెద్దదోర్నాల: మాయ మాటలతో బాలికను నిర్బంధించిన ఓ ఉపాధ్యాయుడు.. అదేమని ప్రశ్నించిన కుటుంబ సభ్యులపై కత్తితో దాడికి పాల్పడిన సంఘటన పెద్దదోర్నాల మండల పరిధిలోని ఐనముక్కలలో శుక్రవారం చోటుచేసుకుంది. ఈ సంఘటనలో బాలిక సోదరుడు కోటపాటి పెద్దబాజికి ఉదరానికి కత్తి గాయమైంది. ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై అంకమరావు కథనం మేరకు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొమరోలు శ్రీనివాస ప్రసాద్(47) గణిత ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. అతనికి వివాహమైంది. భార్య విశాఖపట్నంలో ఉండగా.. ఇతను మరో యువకునితో కలిసి ఐనముక్కలలో ఒక ఇంటిని అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం సెలవు పెట్టిన ఇతను పాఠశాలలోనే 9వ తరగతి చదువుతున్న బాలికకు మాయమాటలు చెప్పి ఇంటికి రప్పించుకుని నిర్బంధించాడు. విషయం తెలిసిన బాలిక తల్లిదండ్రులు, బంధువులు హుటాహుటిన ఐనముక్కలలోని ఉపాధ్యాయుడి ఇంటికి వెళ్లి ప్రశ్నించారు. మొదట తనకు తెలియదంటూ బుకాయించి, కాసేపటి తర్వాత ఎదురు తిరిగి డైనింగ్ టేబుల్ మీద ఉన్న కత్తితో దాడికి పాల్పడ్డాడు. బాలికకు వరుసకు సోదరుడైన కోటపాటి పెద్దబాజికి కత్తి గాయమైంది. క్షతగాత్రుడిని మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో చేర్పించారు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంకమరావు తెలిపారు. ఈ ఘటనపై డీవైఈఓ చంద్రమౌళీశ్వర్‌ను వివరణ కోరగా ఉపాధ్యాయుడు శుక్రవారం సెలవులో ఉన్నట్లు తెలిపారు. ఎంఈఓ మస్తాన్‌నాయక్‌ను విచారణకు ఆదేశించామని, నివేదిక అందగానే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ప్రాణం తీసిన అతివేగం



మృతి చెందిన జాన్‌ప్రకాశ్



సంఘటనా స్థలంలో క్షతగాత్రులు

● రెండు బైకులు ఢీకొన్న ఘటనలో యువకుడు దుర్మరణం

● ముగ్గురికి తీవ్రగాయాలు.. వారిలో ఇద్దరి పరిస్థితి విషమం

పుల్లలచెరువు: అతి వేగం ఒక నిండుప్రాణాన్ని బలితీసుకుంది. ఈ సంఘటన పుల్లలచెరువు మండలంలోని కవలకుంట్ల గ్రామ శివారులో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. మర్రివేముల గ్రామానికి చెందిన కె.జాన్ ప్రకాశ్(27) వ్యక్తిగత పనుల నిమిత్తం బైక్‌పై యర్రగొండపాలెం వెళ్లి స్వగ్రామానికి వస్తున్నాడు. యర్రగొండపాలెం మండలానికి చెందిన పరిశపోగు దేవసహాయం, ఎనిబేరి యోహాన్ ఒక శుభకార్యం నిమిత్తం పుల్లలచెరువు మండలంలోని గంగవరం గ్రామానికి వచ్చారు. తిరుగుప్రయాణంలో గంగవరం గ్రామానికి చెందిన కేశనపల్లి గురవయ్యతో కలిసి యర్రగొండపాలెం వెళ్లే క్రమంలో కవలకుంట్ల శివారు వద్ద వీరి బైక్, జాన్‌ప్రకాశ్ బైక్ ఢీకొంది. ఈ ఘటనలో జాన్‌ప్రకాశ్ అక్కడికక్కడే మృతిచెందగా, ముగ్గురికి తీవ్రగాయాలు కావడంతో 108 వాహనంలో వైపాలెం వైద్యశాలకు తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరులోని ఓ ఆస్పత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ రెండు వాహనాలు అతివేగంగా రావడం వల్లే ప్రమాదం జరిగిందని అక్కడికి సమీపంలోని పొలాల్లో ఉన్న వ్యక్తులు చెబుతున్నారు. రెండు బైకులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. పుల్లలచెరువు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు జాన్‌ప్రకాశ్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

విద్యుదాఘాతంతో వలంటీర్ మృతి



మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

బేస్తవారిపేట: పొలంలో విద్యుదాఘాతానికి గురై వలంటీర్ మృతి చెందిన సంఘటన బేస్తవారిపేట మండలంలోని పూసలపాడు గ్రామంలో శుక్రవారం జరిగింది. వలంటీర్ పత్తిరెడ్డి నాగార్జునరెడ్డి (28) తన తండ్రి రమణారెడ్డితో కలిసి మిరప పంటలో పురుగు మందు పిచికారీ చేసేందుకు వెళ్లాడు. బోరు నీటి కోసం స్టార్టర్‌ను ఆన్‌చేసే సమయంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. విద్యుత్ షాక్‌తో కిందపడిపోయిన కుమారుడిని గమనించిన తండ్రి.. సంఘటన స్థలం వద్దకు వెళ్లాడు. చుట్టుపక్కల పొలాల్లోని రైతులు, గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో అపస్మారకస్థితిలో ఉన్న నాగార్జునరెడ్డిని కారులో కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. వలంటీర్‌గా విధులు నిర్వహిస్తూ గ్రామంలో నాగార్జునరెడ్డి మంచిపేరు తెచ్చుకున్నాడు. కుటుంబానికి అండగా ఉన్న కుమారుడి మరణంతో తల్లిదండ్రులు రమణారెడ్డి, సుబ్బమ్మ, కుటుంబ సభ్యులు, బంధువులు భోరున విలపిస్తున్నారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు భారీగా కంభం ప్రభుత్వ వైద్యశాలకు చేరారు. ఎస్సై బీ నరసింహారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలకు సిద్ధం కావాలి

● ఏకేయూ వీసీ ప్రొఫెసర్ అంజిరెడ్డి పిలుపు



మాట్లాడుతున్న ఏకేయూ వీసీ ప్రొఫెసర్ మారెడ్డి అంజిరెడ్డి

ఒంగోలు: ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ చదువుతున్న విద్యార్థులు మొదటి సెమిస్టర్ పరీక్షలకు సిద్ధం కావాలని ఏకేయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ మారెడ్డి అంజిరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక విశ్వవిద్యాలయం సమావేశపు హాలులో 14 నోడల్ కేంద్రాల ప్రిన్సిపాళ్లు, 38 పరీక్ష కేంద్రాల ప్రధాన ఆచార్యులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయం ఏర్పడిన తర్వాత జరిగే మొదటి పరీక్షలు కావడంతో ప్రతిఒక్కరూ అత్యంత జాగ్రత్తగా పరీక్షలు నిర్వహించాలన్నారు. బాధ్యతాయుతంగా వ్యవహరించి విశ్వవిద్యాలయానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హరిబాబు మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో పరీక్షల నిర్వహణకు అందరూ కృషి చేయాలన్నారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన నిధులను వెంటనే మంజూరు చేసేందుకు వీలుగా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇన్విజిలేటర్ల నియామకంలోనూ, పరీక్ష కేంద్రానికి విద్యార్థుల సంఖ్య కేటాయింపులోనూ ఆయా పరీక్ష కేంద్రాల ప్రధానాచార్యులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బంది అన్ని చర్యలు తీసుకోవాలని, ఏమైనా ఇబ్బందులు తలెత్తితే సదరు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని యూజీ పరీక్ష విభాగం సమన్వయకర్త డాక్టర్ డి.వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణ విషయంలో పలువురు ప్రధానాచార్యులు వారి అభిప్రాయాలను వెల్లడించారు. ఏసీఈ డాక్టర్ బి.పద్మజ, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.రాజమోహన్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నిర్మలామణి, డీవోఏ డాక్టర్ జి.సోమశేఖర్, ఓఎస్‌డీ డాక్టర్ కేవీఎన్ రాజు, ఉమెన్స్ సెల్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎ.భారతీదేవి, అన్ని పరీక్ష కేంద్రాలు, నోడల్ కేంద్రాల ప్రధానాచార్యులు, విశ్వవిద్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి

● కలెక్టర్‌కు జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ వినతి



కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న రవీంద్రరెడ్డి

కొత్తపట్నం: మిచాంగ్ తుఫాన్ వలన నష్టపోయిన రైతులకు పరిహారం అందే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్‌కు జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ రవీంద్రరెడ్డి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. జిల్లాలో రైతులు సాగుచేసుకుంటున్న వరి, మొక్కజొన్న, కంది, మినుము, పొగాకు, జొన్న, శనగ కలుపుకుని 60 వేల ఎకరాల్లో సాధారణ పంటలు దెబ్బతిన్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా ఉద్యానవన పంటలైన మిరప, అరటి, చామదుంప, బొప్పాయి పంటలు జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో ఎక్కువగా దెబ్బతిన్నాయని తెలిపారు. నష్టపోయిన పంటలను అధికారులు గుర్తించి ప్రభుత్వానికి నివేదికలు పంపించి పంట నష్టపరిహారం ఇప్పించాలని కలెక్టర్‌ను రవీంద్రరెడ్డి కోరారు.

జాతీయ విద్యా విధానం సరిలేదు

● పీడీఎస్‌యూ నాయకుల విమర్శ



మాట్లాడుతున్న గనిరాజు

ఒంగోలు టౌన్: కేంద్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న జాతీయ విద్యా విధానం సరిలేదని పీడీఎస్‌యూ నాయకులు విమర్శించారు. నగరంలోని సీవీఎన్ రీడింగ్ రూంలో శుక్రవారం పీడీఎస్‌యూ జిల్లా 16వ మహాసభలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు యు.గనిరాజు మాట్లాడుతూ.. విద్యారంగాన్ని మనువాదంతో నింపేందుకే నూతన జాతీయ విద్యావిధానాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని మండిపడ్డారు. డార్విన్ జీవన పరిణామ సిద్ధాంతం, మొగలుల చరిత్ర, భగత్‌సింగ్ చరిత్ర, పీరియాడిక్ టేబుల్ తదితర పాఠ్యాంశాలను తొలగించి రామాయణం, మహాభారతాలను పెట్టడాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. దేశ ప్రగతికి బాసటగా నిలవాల్సిన యూనివర్సిటీలను అగ్రకుల అగ్రహారాలుగా మార్చారన్నారు. బీజేపీ పాలనలో లక్షకు పైగా పాఠశాలలు మూతపడ్డాయని, నిరుద్యోగం పెరిగిపోయిందని చెప్పారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. జె.వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించిన సభలో ఏకేయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ హర్ష ప్రీతమ్, సంఘ రాష్ట్ర, జిల్లా నాయకులు ఎల్.రాజశేఖర్, ఆర్.మోహన్, నాగరాజు, సిసింద్రి బాబు, కోటి, చిన్ను, కిషోర్, రమేష్ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు విజయవంతం చేయండి

మార్కాపురం టౌన్: ఈ నెల 12, 13వ తేదీల్లో ఒంగోలులో నిర్వహించనున్న జిల్లా ఎస్ఎఫ్ఐ 45వ మహాసభలను విజయవంతం చేయాలని సంఘ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సీహెచ్ వినోద్, విజయ్, నాయకులు లోకేష్, శ్రీను శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. సోషలిజం, ప్రజా పోరాటం, స్వాతంత్ర్యం, ప్రజా స్వామ్యం నినాదంతో ఏర్పడిన ఎస్ఎఫ్ఐ 45వ మహాసభను నిర్వహిస్తోందని తెలిపారు. గతంలో చేసిన కార్యక్రమాలను సమీక్షించి భవిష్యత్తు కార్యాచరణను రూపొందించుకునేందుకు, విద్యా రంగ అభివృద్ధికి దోహదపడే తీర్మానాలను నిర్ణయించడానికి ఈ మహాసభలు వేదిక కానున్నాయని చెప్పారు.